సాక్షి
జగిత్యాల
బుధవారం । 10 । మే । 2023



14న బీజేపీ ఏక్తాయాత్ర

కథలాపూర్: కరీంనగర్‌లో ఈనెల 14న చేపట్టే హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ నేత రామకృష్ణ కోరారు.



వేగంగా ధాన్యం సేకరణ

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సెర్ప్ ఏపీఎం సుధీర్ సూచించారు. ఐకేపీ కేంద్రాలను తనిఖీ చేశారు.



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఎమ్మెల్సీ కవిత రాక



ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల: నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొనున్నారు. అనంతరం బీరప్ప ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలకు హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు నిజామాబాద్ వెళ్లనున్నారు.

వేగంగా ధాన్యం కొనుగోలు



ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆదేశించారు. మంగళవారం తిమ్మాపూర్, లక్ష్మీపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తేమ శాతంఉన్న ధాన్యాన్ని వ్యవసాయాధికారుల ఆమోదం కాగానే తూకం వేసి రైస్‌మిల్లుకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రైతులు కూడా తేమశాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్, ఆర్‌ఐ భూమయ్య, ఏపీఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆరోగ్య మహిళ’ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డాక్టర్ సమియొద్దీన్

కథలాపూర్(వేములవాడ): ప్రతీ మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో చేపట్టే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగించుకోవాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎండీ సమియొద్దీన్ సూచించారు. అంబారిపేట, కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కథలాపూర్‌లో ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా మహిళలకు అందిస్తున్న చికిత్సలపై ఆరా తీశారు. అంబారిపేటలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సింధూజ, హెచ్‌ఈవో రామ్మోహన్, భూషణ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: 2023–24 సంవత్సరానికి కార్పొరేట్ జూనియర్ కళాశాలల స్కీం కోసం కళాశాలల యాజమాన్యాల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. రెప్యూటెడ్ జూనియర్ కళాశాలల స్కీం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, డిసబుల్, మైనార్టీ విద్యార్థులకు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



అభిషేక్(ఫైల్)

మేడిపెల్లి(వేములవాడ): ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో అభిషేక్(18) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మేడిపెల్లికి చెందిన బోడ్డుపెల్లి అభిషేక్ జగిత్యాలలోని ఓ ప్రైవేట్ కాలేజీలో సీఈసీ మొదటి చదువుతున్నాడు. మంగళవారం విడుదలైన పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. తీవ్రంగా మనస్తాపం చెందిన అభిషేక్.. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకున్నాడు. మృతుడి తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రవీందర్‌రావు తెలిపారు.

ఎస్సైపై మహిళ ఫిర్యాదు

జగిత్యాలక్రైం: స్థానిక జాంబాగ్ ప్రాంతానికి చెందిన షేక్ ఫర్హా తనపై ఎస్సై దాడి చేశారని మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. షేక్ ఫర్హా మంగళవారం మధ్యాహ్నం బెజ్జంకి నుంచి జగిత్యాలకు ఆర్టీసీ బస్సులో వస్తుండగా కరీంనగర్‌లో జగిత్యాల రూరల్ ఎస్సై భార్య కూడా బస్సు ఎక్కిందని తెలిపింది. బస్సులో సీటు విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరుగగా, షేక్ ఫర్హా ఆమె తల్లి కూడా రూరల్ ఎస్సై భార్యను దూషించారు. దీంతో రూరల్ ఎస్సై భార్య ఫోన్ ద్వారా రూరల్ ఎస్సైకి సమాచారం అందించారు. జగిత్యాల బస్ డిపో వద్ద నిలుపగా ఎస్సై బస్సులో ఎక్కి ఆ మహిళను నిలదీసి చేయితో కొట్టినట్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది.

బాలికలదే పైచేయి

- ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 68శాతం నమోదు
- ద్వితీయ సంవత్సరంలో 77శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో జిల్లా ఫస్టియర్‌లో 14, సెకండియర్‌లో 10వ స్థానం

జగిత్యాల: ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో జిల్లా ద్వితీయ సంవత్సరంలో 10వ స్థానంలో నిలువగా, ప్రథమ సంవత్సరంలో 14వ స్థానం సాధించింది. జిల్లాలో 71 జూనియర్ కళాశాలలుండగా ఇందులో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 13 మోడల్ స్కూళ్లు, 5 కేజీబీవీలు, 5 సోషల్ రెసిడెన్షియల్, 5 మైనార్టీ రెసిడెన్షియల్, 3 బీసీ రెసిడెన్షియల్, 2 టీఎస్‌డబ్ల్యూఆర్‌సీజేసీ, మిగతావి ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి.

ప్రథమ సంవత్సరంలో..

- మొదటి సంవత్సరంలో బాలురు మొత్తం 2,643 మంది పరీక్ష రాయగా 1.179 మంది ఉత్తీర్ణులై 44 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.
- బాలికల్లో 3,547 మంది పరీక్షలు రాయగా 2,445 మంది ఉత్తీర్ణత సాధించి 68 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

ద్వితీయ సంవత్సరంలో...

- ద్వితీయ సంవత్సరంలో బాలురు మొత్తం 3,048 మంది పరీక్ష రాయగా 1,758 మంది పాసై 57 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.
- బాలికల్లో 3,686 మంది పరీక్ష రాయగా 2,848 మంది ఉత్తీర్ణత సాధించి 77 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

ప్రైవేటులో..

జనరల్, ప్రైవేటులో బాలురు 511 మంది రాయగా 124 మంది పాసై 24 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. బాలికల్లో 235 మంది పరీక్ష రాయగా, 8 మంది ఉత్తీర్ణత సాధించి 34శాతం ఉత్తీర్ణత నమోదుచేశారు.

ప్రథమ సంవత్సరం ఒకేషనల్‌లో..

ప్రథమ సంవత్సరం ఒకేషనల్‌లో బాలురు 770 మంది పరీక్ష రాయగా 206 మంది పాసై 26 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. బాలికల్లో 429 మంది పరీక్ష రాయగా, 281 మంది ఉత్తీర్ణత సాధించగా 65 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

ద్వితీయ సంవత్సరం ఒకేషనల్‌లో..

ద్వితీయ సంవత్సరం ఒకేషనల్‌లో బాలురు 744 మంది పరీక్ష రాయగా 343 మంది పాసై 46 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. బాలికల్లో 295 మంది పరీక్ష రాయగా, 206 మంది ఉత్తీర్ణత సాధించి 69 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

సెకండ్ ఇయర్ ఒకేషనల్ ప్రైవేటులో..

సెకండ్ ఇయర్ ఒకేషనల్ ప్రైవేటులో బాలురు 41 మంది పరీక్ష రాయగా 8 మంది పాసై 19 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. బాలికల్లో 37 మంది పరీక్ష రాసి 10 మంది ఉత్తీర్ణులయ్యారు.

పెద్దాపూర్ గురుకులం ప్రతిభ

మెట్‌పల్లి(కోరుట్ల): పెద్దాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో కొండె సంపత్‌రెడ్డి 466, వి.మనోజ్ 465 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వి.మనోజ్‌కుమార్ 983, డి.అభిలాష్ 981, బైపీసీలో జి.శ్రీఆకాశ్ 986, జి. హాస్వంత్ 985 మార్కులు సాధించారు.



డి.చందన



టి.శ్రియ



ఎస్. ప్రీతి



బి.రమ్య

బాలికలే టాప్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌లో బాలికలు ఇంటర్‌లో అత్యధిక సంఖ్యలో పాసయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం ఎంపీసీలో అనన్య 464/470, బైపీసీలో డి.చందన 410/440, సీఈసీలో టి.శ్రియ 438/500, హెచ్ఈసీలో ఎండీ ఇర్ఫాన్ 397/500, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎస్.ప్రీతి 887/1000, బైపీసీలో ఎం.జ్యోతిర్మయి 970/1000, సీఈసీలో పి.రమ్య 944/1000, హెచ్ఈసీలో కె.నవనీత 808/1000 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సంజీవ్ తెలిపారు.

– మోడల్ స్కూల్ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో మధుశ్రీ 451/470, బైపీసీలో ఇ.సౌమ్య 394/440, సీఈసీలో ఎ.నిఖిత 417/500 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జి.నవ్య 949/1000, బైపీసీలో జి.హర్షిణి 951/1000, సీఈసీలో జె.జానకి 972/1000 మార్కులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పలువురు అభినందించారు.

అమ్మానాన్న ప్రోత్సాహంతోనే..



ఎర్దండి గ్రామానికి చెందిన అనన్య ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 464 మార్కులు సాధించింది. రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు పొందింది. అనన్య స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంది. అనన్య మాట్లాడుతూ తన తల్లితండ్రుల ప్రోత్సాహంతోనే బాగా చదివి ర్యాంకు తెచ్చుకున్నానని తెలిపింది. తండ్రి లింగం ఉపాధి కోసం సింగపూర్ వెళ్లగా, తల్లి సుమంత వ్యవసాయం చేస్తూ, బీడీలు చుడుతూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటోంది. తనకు ర్యాంకు రావటం ఆనందంగా ఉందని, భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను కావడం లక్ష్యమని వివరించింది.

రాష్ట్రంలో రెండోర్యాంకు



మణిమాల



కాత్యం ఐశ్వర్య

మల్లాపూర్(కోరుట్ల): సిరిపూర్ గ్రామానికి చెందిన సునావత్ రాజు–హారిక కుమార్తె మణిమాల సెకండియర్ బైపీసీలో 1000కి 990 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండోర్యాంకు సాధించింది. వాల్గొండకు చెందిన సుజాత–నరేశ్‌రెడ్డి కుమార్తె ఐశ్వర్య సెకండీయర్ ఎంపీసీలో 1000కి 984 మార్కులు సాధించింది.

డాక్టర్ కావాలని ఉంది

బైపీసీలో స్టేట్ సెకండ్ టాపర్‌గా నిలవడం ఆనందంగా ఉంది. మా అమ్మానాన్న ప్రోత్సాహం, అధ్యాపకుల మార్గదర్శకత్వంతోనే ఇది సాధ్యమైంది. ఎంబీబీఎస్ సీట్ సాధించి డాక్టర్ కోర్సు చదివి పేదలకు సేవలు అందిస్తా.

– సునావత్ మణిమాల, సెకండియర్ బైపీసీ

మల్యాల విద్యార్థుల ప్రతిభ



ఎం.అశ్వీత



కె.అంజలి

మల్యాల(చొప్పదండి): ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్‌స్కూల్, తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో రిషికేతన,ఎం.అశ్వీత 990/1000, వి.అనుశ్రీ 984, జె.స్రవంతి 971, బైపీసీలో వి.మేఘన 989/1000, జి.అక్షయ 988 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో కె.కల్యాణి 466/470, సీహెచ్.భావన 464, కె.రాజశ్రీ 458, ఎ.అర్జున్ 441, పి.హరిప్రియ 445, కె.వినయ్ 436, బైపీసీలో కె.అంజలి 436/440, టి.అశ్వీత 435, టి.నిహారిక 433, డి.అక్షయ 433, జి.శైలజ 412, ఇ.దీపిక 405 మార్కులు సాధించారు.

సోమన్‌పల్లి విద్యార్థి ప్రతిభ



ఇందిరప్రియదర్శిని

జగిత్యాలరూరల్: సోమన్‌పల్లి మాజీ సర్పంచ్ గొంటి వనిత కుమార్తె గొంటి ఇందిర ప్రియదర్శిని బైపీసీలో 440 మార్కులకు 434 మార్కులు సాధించింది.

ధర్మపురి విద్యార్థుల హవా

ధర్మపురి: మగ్గిడి మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరం విద్యార్థులు 127 మంది పరీక్ష రాయగా, 112 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 135 మందికి 113 మంది పాసయ్యారు. కోస్నూర్‌పల్లెకు చెందిన సాత్విక్‌రెడ్డి ఇంటర్ మొదటి సంవత్సరంలో 464/470 మార్కులు సాధించింది. తండ్రి లింగారెడ్డి, తల్లి లక్ష్మి. వీరిది రైతుకుటుంబం. ధర్మపురికి చెందిన స్తంభంకాడి అశోక్ దంపతుల కూతురు రిషిక. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470కి 467 మార్కులు సాధించింది. వీరిది నిరుపేద కుటుంబం.

పేదింటి పిల్లలు.. చదువులో మెరికలు



భాగ్యలక్ష్మి



అఖిల



బి.గంగోత్రి

సారంగాపూర్(జగిత్యాల): స్థానిక ప్రభుత్వ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 90 మంది పరీక్ష రాయగా 87 మంది (96.66 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 76 మంది పరీక్ష రాయగా 73 మంది(96.05 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో కుడుకల భాగ్యలక్ష్మి 899, బైపీసీలో బోర్లకుంట అఖిల 862, సీఈసీలో బి.గంగోత్రి 846 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో అక్షయ (441), బైపీసీలో జి. రాజేందర్ 389, సీఈసీలో యాదరవేణి ప్రణయ్ 439 మార్కులు సాధించారు.

బీర్‌పూర్ జూనియర్ కళాశాలలో:

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 61శాతం, మొదటి సంవత్సరంలో 44 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 959 మార్కులతో వర్షిత, బైపీసీలో 937 మార్కులతో నిఖిత, సీఈసీలో 920 మార్కులతో వైష్ణవి ప్రతిభ చూపారు.

భాగ్యలక్ష్మిది రైతు కుటుంబం..

కుడుకల భాగ్యలక్ష్మి తల్లి గంగరాజు, తండ్రి ఎలయ్య వ్యవసాయం చేసుకుని బతుకుతున్నారు. బిడ్డను మంచి ఇంజినీర్ చేయాలన్నది లక్ష్యమని చెబుతున్నారు.

అఖిల తల్లితండ్రులు వ్యవసాయ కూలీలు..

సారంగాపూర్ జూనియర్ కళాశాల విద్యార్థి బొర్లకుంట అఖిల తల్లి రాజవ్వ, తండ్రి రాజేశం వ్యవసాయంతో పాటు, కూలీ పనులు చేస్తున్నారు. తల్లి బీడీలు చుడుతోంది. అఖిలను డాక్టర్‌గా చదివించాలని వారు ఆశయం.

బత్తిని గంగోత్రి తల్లితండ్రులు రైతులు..

గంగోత్రి తల్లి పద్మ బీడీలు చుడుతూ, కూలీ పనిచేస్తూ కుమార్తెను చదివిస్తోంది. ఉన్నత చదువులు చదివించాలన్నది ఆమె లక్ష్యం.

సమ్మెపై తగ్గేదే లే!

- పట్టువీడని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- జేపీఎస్‌ల ఇళ్లకు నోటీసులు అంటించిన డీపీవో సిబ్బంది
- సా. 5గంటలతో ముగిసిన ప్రభుత్వ గడువు
- టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రితో చర్చలు విఫలం
- న్యాయం జరిగేవరకు సమ్మె సాగుతుందని స్పష్టీకరణ



పంచాయతీ కార్యదర్శులకు సంఘీభావం తెలుపుతున్న ఈటల

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తమ సర్వీసు రెగ్యులరైజ్ చేయాలంటూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె మరింత ఉధృతమైంది. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయానికి సమ్మె విరమించి సర్వీసులో చేరాలన్న ప్రభుత్వ ఆదేశాలను జూనియర్ పంచాయతీ సెక్రటరీ (జేపీఎస్)లు తిరస్కరించారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు తాము సమ్మె వీడేది లేదని, ముందుకు సాగడమే తమ నిర్ణయమంటూ తేల్చి చెప్పారు. దీంతో సమ్మె తీవ్రతరం కానుంది. సర్వీసు క్రమబద్ధీకరణ కోసం సమ్మె చేపట్టిన జూనియర్ పంచాయతీ సెక్రటరీలను మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు విధుల్లో చేరాలని ఆశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఆదేశించిన విషయం తెలిసిందే.

నోటీసులపై జేపీఎస్‌ల మండిపాటు

తమ డిమాండ్లు నెరవేర్చకుండా విధుల నుంచి తొలగిస్తామంటూ ఇళ్లకు నోటీసులు అంటించడంపై జేపీఎస్‌లు మండిపడుతున్నారు. ఇళ్లకునోటీసులు అంటించడం ద్వారా కుటుంబ సభ్యులను మభ్యపెట్టి, వారిని ఆందోళనకు గురిచేసే ఎత్తుగడగా అభివర్ణిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం మంత్రి ఎర్రబెల్లి 32 జిల్లాకు ఒకరి చొప్పున జేపీఎస్‌లతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా చర్చలు జరిపారు. జేపీఎస్‌ల అంతా సమ్మె విరమించి విధుల్లో చేరాలని మంత్రి కోరగా.. తమకు లిఖితపూర్వక హామీకి పట్టుబట్టడంతో చర్చలు అసంపూర్తిగానే ముగిశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం (పెద్దపల్లి: 208, జగిత్యాల: 306, కరీంనగర్: 226, సిరిసిల్ల: 198)938 మంది జేపీఎస్‌లు నాలుగేళ్లుగా పనిచేస్తున్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదురుగా శిబిరంలో సమ్మె చేస్తున్న జేపీఎస్‌లను బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, తెలంగాణ జనసమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షులు కోదండరాం, బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలు తదితర ప్రజాసంఘాల నేతలు శిబిరాన్ని పరామర్శించి మద్దతు తెలిపారు.

సమస్య ఏంటి?

జూనియర్ పంచాయతీ సెక్రటరీల రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ టీఎస్‌పీఎస్సీ ద్వారా 2018 ఆగస్టు 31న జారీ చేసింది. పరీక్షల నిర్వహణ అనంతరం ఎంపికైన వారు 2019 ఏప్రిల్ 19న సర్వీసులో చేరారు. బేసిక్ సర్వీస్ కండిషన్స్‌లో మూడేళ్ల సర్వీసు తరువాత గ్రేడ్–4 పంచాయతీ సెక్రటరీగా గుర్తిస్తూ సర్వీసు రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఇక్కడ కాంట్రాక్టు అనే పదం ఎక్కడా పేర్కొనలేదు. కేవలం ఇది ప్రభుత్వ ఉద్యోగమని, తొలి మూడేళ్ల కాలాన్ని ప్రొహిబిషన్ కాలంగా పరిగణిస్తామని వివరించింది. ప్రొహిబిషన్ కాలం ముగిసినా.. వారిని రెగ్యులరైజ్ చేయకుండా 2021, జూలై15న జీవో.26 జారీ చేశారు. ఈ జీవోలో ‘అగ్రిమెంట్’ అనే కొత్త పదం తీసుకువస్తూ.. ప్రొహిబిషన్ కాలాన్ని ఏడాదిపాటు పెంచారని జేపీఎస్‌లు ఆరోపిస్తున్నారు. అనంతరం నాలుగు సంవత్సరాల సర్వీసు పూర్తయిన తరువాత కూడా వీరికి సర్వీసు రెగ్యులర్ చేయలేదు. దీంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గత ఏప్రిల్ 13న నోటీసులిచ్చి, 28 నుంచి సమ్మెలోకి దిగారు.

విధుల్లో చేరిన కొందరు?

ఈ నేపథ్యంలో కొందరు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వివిధ మండలాల పరిధిలో సమ్మె వీడి విధుల్లో చేరారని పంచాయతీ అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో నలుగురు, రామడుగులో ముగ్గురు, గంగాధరలో నలుగురు, మానకొండూరులో ఒకరు, హుజూరాబాద్, వీణవంకలో ఎవరూ చేరలేదు. జమ్మికుంటలో ఇద్దరు, సైదాపూర్‌లో ఒక్కరు.. ఇలా జిల్లావ్యాప్తంగా 57మంది విధుల్లో చేరినట్లు తెలిపారు. సిరిసిల్లలో తొమ్మిది మంది విధుల్లో చేరారని సమాచారం. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలో ఎవరూ విధుల్లో చేరలేదని, అందరూ సమ్మెలోనే కొనసాగుతున్నారు.

ఇళ్లకు నోటీసులివ్వడం దారుణం



ప్రభుత్వం సమ్మెతో చర్చకు రాకుండా భయభ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తిస్తోంది. తమను మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు విధుల్లో చేరకపోతే, శాశ్వతంగా తొలగిస్తామన్న ఆదేశాలను మా ఇళ్లకు అంటించడం ముమ్మాటికీ బెదిరించడమే. ఈ చర్య మా కుటుంబ సభ్యుల్లో ఆందోళన రెకెత్తించేలా ఉంది. కానీ, మేం ప్రభుత్వం ఎత్తుగడలకు మేం తలవంచం.

– మనోహర్‌రెడ్డి

మాట నిలబెట్టుకోవాలి



వాస్తవానికి మేమేం కొత్త కోరికలు కోరడం లేదు. మేము సర్వీసులో చేరే క్రమంలో ఇచ్చిన మాటనే నిలబెట్టుకోవాలని అడుగుతున్నాం. దీనిపై ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయం. కాంట్రాక్టు అన్న పదాన్ని కొత్తగా చేర్చి ప్రభుత్వం తాను ఇచ్చిన మాట నుంచి తప్పించుకునే యత్నం చేస్తోంది. నోటిఫికేషన్ సమయంలో పేర్కొన్న విధంగా మా అందరినీ క్రమబద్ధీకరించాల్సిందే.

– శ్రీనివాస్

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం

రాష్ట్ర సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్(ధర్మపురి): సబ్బండవర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఎండపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టే పథకాలు దేశానికే దిక్సూచిగా నిలిచాయన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో తీసుకున్న గొప్ప నిర్ణయాలు ఇవి అని ప్రశంసించారు. సర్కారు ద్వారా పొందని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదని తెలిపారు. ప్రతిపక్షాలు పసలేని విమర్శలు చేస్తూ పబ్బం గడుపుతున్నాయని దుయ్యబట్టారు. 35ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని మనిషిగా, ఆపద ఉండి ఎవరు వచ్చినా కష్టాలు తీర్చిన నాయకుడిగా ఇన్నేళ్లుగా తనను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటున్న నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు అని అన్నారు. ఆత్మీయ సమ్మేళనం అంటే పూర్తిగా పార్టీ కార్యక్రమమని తెలిపారు. అనేక ఏళ్లుగా పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తల కష్టసుఖాలు తెలుసుకుని, సంక్షేమ పథకాలపై చర్చించుకొని, ఇంటింటికీ వాటి ఫలాలు చేరేలా వివరించి చెప్పడం కోసం ఏర్పాటు చేసుకున్న గొప్ప కార్యక్రమమని మంత్రి వివరించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ క్రిష్టారెడ్డి, సింగిల్‌విండోల అధ్యక్షులు గోలి రత్నాకర్, గూడ రాంరెడ్డి, ఎండపల్లి, వెల్గటూర్ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు సింహాచలం జగన్, చల్లూరి రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైకోర్టు జడ్జిని కలిసిన ఎస్పీ



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: హైకోర్టు జడ్జి పుల్ల కార్తీక్ స్థానిక పోలీసు గెస్ట్‌హౌస్‌లో బసచేశారు. మంగళవారం ఎస్పీ భాస్కర్ జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట డీఎస్పీ ప్రకాశ్ ఉన్నారు.

17శాతం తేమ ఉండాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

ధర్మపురి: కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యంలో 17శాతం తేమ ఉండేలా చూసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆదేశించారు. ధర్మపురి వ్యవసాయ మార్కెట్‌లో పోసిన ధాన్యాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత, ప్రమాణాలు తప్పకుండా పాటించి రైతులు గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. అకాల వర్షాలతో రైతులకు నష్టం వాటిల్లకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, జైనా పీఏసీఎస్ చైర్మన్ నరేశ్, తహసీల్దార్ వెంకటేశ్, డిప్యూటీ తహసీల్దార్ ఎండీ అకీం, ఏఈవో నవ్య పాల్గొన్నారు.

సమ్మె శిబిరంలో పంచాయతీ కార్మికుడికి ఫిట్స్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట కారోబార్లు, బిల్ కలెక్టర్లు, పంచాయతీ సిబ్బంది ఐదోరోజు మంగళవారం సమ్మె కొనసాగించారు. అయితే, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడు మదరి రాజం అక్కడకు వచ్చాడు. హఠాత్తుగా ఫిట్స్ రావడంతో శిబిరంలో పడిపోయాడు. తోటికార్మికులు వెంటనే స్పందించి తాళంచెవి గుత్తిని చేతిలో పెట్టి కాళ్లు, చేతులు పట్టి మర్దన చేశారు. దీంతో కార్మికుడు స్పృహలోకి వచ్చాడు. ఆ తర్వాత కార్మికుడిని తన ఇంటికి తీసుకెళ్లారు.

బాండ్ పేపర్‌కు బీఆర్ఎస్ పిండప్రదానం

మెట్‌పల్లి(కోరుట్ల): బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల పిండప్రదానం నిరసనలు మండలంలో చర్చనీయాంశమయ్యాయి. ఎంపీటీసీ ఎన్నికల్లో కొండ్రికర్ల గ్రామంలోని వాగుపై వంతెన నిర్మిస్తామని బాండ్ పేపర్ మీద రాసి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు.. ఆ హామీని నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ సోమవారం సర్పంచ్ రాజగంగు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు బాండ్ పేపర్‌కు పిండప్రదానం చేసి నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. దీనికి కౌంటర్‌గా మంగళవారం కొండ్రికర్లలో ఎంపీపీ మారు సాయిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని రాసి ఇచ్చిన బాండ్ పేపర్‌కు పిండ ప్రదానం చేసి నిరసన తెలిపారు. అంతకుముందు అర్వింద్ దిష్టిబొమ్మతో ఊరేగింపు నిర్వహించి ప్రధాన కూడలిలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని చెప్పి ఎన్నికల్లో గెలిచిన ఎంపీ అర్వింద్.. ఆ తర్వాత దానిని విస్మరించారని ఆరోపించారు. రైతులను మోసం చేసిన ఆయన ఎంపీ పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కొండ్రికర్ల గ్రామంలో ఎమ్మెల్యే ఇప్పటికే రూ.9కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని, మరో రూ.60లక్షలతో ప్రతిపాదనలు పంపించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం రాజిరెడ్డి, మెండే రమేశ్, మారుతిరెడ్డి, కోరెపు మురళి, పుల్లా చంద్రయ్య, నర్సయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై 'పట్టింపు' ఏదీ?



కల్యాణకట్ట భవనం వద్ద నీరు నిలిచి, అపరిశుభ్రంగా మారిన దారి



అపరిశుభ్రంగా ఉన్న మెట్లదారి

- కంపు కొడుతున్న మెట్లదారి పరిసరాలు
- 45మంది సిబ్బందికి 30మంది విధుల్లో..
- నిత్యం రెండు షిఫ్టుల్లో పనుల నిర్వహణ

మల్యాల(చొప్పదండి): ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత లోపించింది. పారిశుధ్యం నిర్వహణపై పర్యవేక్షణ కొరవడింది. ఆలయ పరిసరాల్లో నీళ్లు నిలిచి పాకురు పట్టి, దుర్వాసన వెదజల్లుతోంది. మెట్లదారి నిర్వహణను పట్టించుకోవడం లేదు. చెత్తాచెదారంతో నిండిపోయి, భక్తులు నడవలేని పరిస్థితి నెలకొంది. చెత్తను ఘాట్‌రోడ్డు సమీపంలో డంపింగ్ చేస్తుండడంతో కాలినడకన వెళ్తున్న భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మల, మూత్రాల దుర్వాసనతో మెట్లదారి నుంచి భక్తులు వెళ్లలేనివిధంగా పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది.

పర్యవేక్షణ కరువు..

- ఆలయం పరిసరాల్లో పారిశుధ్యం నిర్వహణపై అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపం భక్తులకు శాపంగా మారింది.
- నిత్యం వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి, ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్నారు.
- ఆ మేరకు పారిశుధ్యం నిర్వహణ చేపట్టడంలో ఆలయ అధికారులు శ్రద్ధచూపడం లేదనే విమర్శలున్నాయి.
- కల్యాణకట్ట భవనం వద్ద నీరు నిలిచి, పాకురు పట్టడం పారిశుధ్య లోపానికి అద్దంపడుతోంది.

ఘాట్‌రోడ్డు పక్కన చెత్త డంపింగ్..

కొండగట్టుకు వెళ్లే ఘాట్‌రోడ్డు మధ్యలో చెత్త డంపింగ్ చేస్తుండడంతో దుర్వాస వస్తోంది. చెత్తాచెదారం రోడ్డుపైకి కొట్టుకువచ్చి, భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త డంపింగ్ చేసేందుకు బొజ్జపోతన్న వద్ద ప్రత్యేకంగా డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసినప్పటికీ అడపాదడపా ఘాట్‌రోడ్డు పక్కన చెత్త డంపింగ్ చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.

కంపుకొడుతున్న మెట్లదారి పరిసరాలు..

- కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డు సమీపంలోని మెట్లదారి నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు.
- నిత్యం మెట్లదారిని శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయి, పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.
- అధికారులు మెట్లదారి నిర్వహణను పట్టించుకోకపోవడంతో మల, మూత్రాలతో కంపు కొడుతోంది. దీంతో మెట్లదారి వెంట స్వామివారిని దర్శించుకోవాలనే భక్తుల కోరిక తీరడం లేదు. ప్రసాదాల తయారీ భవనం సమీపంలోసైతం చెత్తచెదారంతోపాటు, మల, మూత్రాల దుర్వాసనతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో గతంలోకన్నా పారిశుధ్యం నిర్వహణ మెరుగుపడినప్పటికీ పారిశుధ్యం నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఆలయపరిసరాల్లో నీళ్లు నిలుస్తుండడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

– అంజిరెడ్డి, భక్తుడు

ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం

చెత్త సేకరణ, పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. నిత్యం రెండు షిఫ్టుల్లో పనులు నిర్వహిస్తున్నారు. చెత్త సేకరణకు ప్రత్యేకంగా ట్రాక్టర్ కొనుగోలు చేశాం. ఆలయ పరిసరాల్లో చెత్త కుండీలు ఏర్పాటు చేశాం.

– వెంకటేశం, ఆలయ ఈవో

సీఎంఆర్ చెల్లించాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: సీఎంఆర్ బకాయిలు ఉన్న రా, బాయిల్డ్ రైస్‌మిల్లర్లు వెంటనే చెల్లించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. మంగళవారం మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. రోజువారీ లక్ష్యాన్ని గడువు తేదీలోపు కంటే ముందుగానే పూర్తిచేయాలన్నారు. సీఎంఆర్ పూర్తయిన రైస్‌మిల్లర్ల సాయం తీసుకుని చెల్లించాలని అన్నారు. తగిన హమాలీలు, వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది రోజువారీ తనిఖీ చేస్తూ సీఎంఆర్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లత, పౌర సరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళను సద్వినియోగం చేసుకోండి

ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. స్థానిక గాంధీనగర్ పీహెచ్‌సీలోని ఆరోగ్య మహిళ సెంటర్‌ను పరిశీలించారు. ప్రతీమహిళకు పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించాలని ఆదేశించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో శ్రీధర్, ప్రోగ్రాం అధికారి జైపాల్‌రెడ్డి ఉన్నారు.

మోసగించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు

- ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన వృద్ధురాలు



ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న వృద్ధురాలు

జగిత్యాల: కొడిమ్యాల మండలం రాంసాగర్‌కు చెందిన నీలగిరి అమ్మాయి అనే వృద్ధురాలు తన భూమిని ఓ వ్యక్తి మోసగించి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. కొడిమ్యాల మండలం రాంసాగర్‌కు చెందిన నీలగిరి అమ్మాయి(86) భర్త నాలుగేళ్ల క్రితం మరణించాడు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కొడుకు కుమారుడి కొడుకు రామేశ్వర్‌రావు రైతుబంధు కోసం తహసీల్దార్ కార్యాలయంలో సంతకం పెట్టాలని తీసుకెళ్లి ఐదునెలల క్రితం రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఆ సమయంలో తనకు తహసీల్దార్ భూమి అమ్మావా, డబ్బులు ముట్టాయా? అని అడగలేదని, అడిగి ఉంటే ఈ మోసం జరిగేది కాదని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. తన మనుమడు రామేశ్వర్‌రావు తన పేరున గల పట్టాభూమిని మోసగించి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, ఆ భూమిని తన పేరిట పట్టా చేయించాలని ఆర్డీవోను కోరింది. దీనిపై వచ్చే కౌలు, రైతుబంధు, పింఛన్‌తోనే బతుకుతున్నానని, తనకు మరో ఆధారం లేదని వాపోయింది. ఆర్డీవో మాధురి వెంటనే స్పందించి కొడిమ్యాల తహసీల్దార్‌కు ఫోన్ చేశారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ఎలా చేశారు, రిజిస్ట్రేషన్ చేసే సమయంలో పూర్తి వివరాలు తెలుసుకుంటారు కదా? అని ప్రశ్నించారు. ఎలాంటి విచారణ చేయకుండా రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు. వయోవృద్ధులకు చట్టపరమైన రక్షణ ఉన్నప్పటికీ కుమారులు, కూతుళ్లు, వారసులు మోసం చేసి ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని, వృద్ధురాలికి అండగా ఉంటామని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు. ఆర్డీవో ఏవో రాజమనోహర్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ గౌరిశెట్టి విశ్వనాథం, విజయ్, యాకూబ్, ప్రకాశ్‌రావు, అశోక్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడ్డ చిన్న పోశం

ధర్మపురి: బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆకసాయిపల్లె గ్రామానికి చెందిన బక్క మల్లేశం, తట్ట చిన్న పోశం మంగళవారం బైక్‌పై వెళ్తుండగా.. ఆకసాయిపల్లె గుట్ట మలుపు వద్ద అదుపుతప్పి కిందపడ్డారు. గాయపడ్డ వీరిని 108 సిబ్బంది అనిల్, సంపత్ ఆస్పత్రికి తరలించారు.

హార్వెస్టర్ ఢీకొని వృద్ధుడి మృతి



బుచ్చయ్య మృతదేహం

గొల్లపల్లి(ధర్మపురి): వరికోత యంత్రం(హార్వెస్టర్) ఢీకొని చెందోళి గ్రామానికి చెందిన జక్కుల బుచ్చయ్య(60) మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం.. బుచ్చయ్య గ్రామ శివారులో గొర్రెలను మేతకు తీసుకుని వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన వరికోత యంత్రం డ్రైవర్ బండారి శ్రీకాంత్ హార్వెస్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వెనుక ఉన్న బుచ్చయ్యను ఢీకొట్టాడు. తీవ్రగాయాలతో బుచ్చయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పు తీర్చమన్నందుకు హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవం

జగిత్యాలజోన్: అప్పుగా తీసుకున్న రూ.5 వేలు తిరిగి చెల్లించలేక, అప్పు ఇచ్చిన వ్యక్తిని హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ మంగళవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం. కోరుట్ల రవీంద్రరోడ్డుకు చెందిన సామల్ల చంద్రశేఖర్ తమ ఇంటి పక్కనే ఉండే జిందం శివరాజం నుంచి తన అవసరాల కోసం 2004లో రూ.5 వేలు అప్పు తీసుకున్నాడు. శివరాజం ఎన్నిసార్లు అడిగినా చంద్రశేఖర్ అప్పు తీర్చలేదు. పలుమార్లు అప్పు గురించి అడుగగా, రూ.2 వేలు ఇచ్చాడు. మిగతా రూ.3 వేల కోసం మళ్లీ అడిగినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో 2007 ఫిబ్రవరి 12న శివరాజం, అప్పు ఇచ్చిన చంద్రశేఖర్ ఇంటికి వెళ్లి.. తనఅప్పు తీర్చాలని పట్టుబట్టాడు. కోపోద్రిక్తుడైన చంద్రశేఖర్.. శివరాజం తలపై రోకలిబండతో కొట్టాడు. శివరాజం కేకలు విన్న అతడి కుమారుడు.. ఆర్ఎంపీ వెంటనే అక్కడకు వెళ్లాడు. అపస్మారకస్థితిలో పడిఉన్న తండ్రి శివరాజంను స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి కోరుట్ల సీఐ, ప్రస్తుత భద్రాద్రి కొత్తగూడెం ఓఎస్డీ సాయిమనోహర్, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ జనార్దన్‌రెడ్డి కేసు దర్యాప్తు చేసి నిందితుడు చంద్రశేఖర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, ఎం.హరీశ్, కె.సురేశ్ పకడ్బందీ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశ పెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం చంద్రశేఖర్‌కు యావజ్జీవ శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది.

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీ చైతన్య' విజయఢంకా



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం

కరీంనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో పి.బిందు 990, బైపీసీ విభాగంలో జి.రోషిణి 989, ఎంఈసీ విభాగంలో జి.ఈశ్వర్ తేజ 983, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కె.విశ్వహరితాజ్ 466, కె.స్నిగ్ధ 466, కె.అక్షయ 466, బైపీసీలో ఎం.సిరివెన్నెల 435, ఎంఈసీలో టి.హారిక 479, సీఈసీలో జె.ప్రశాంత్ 491 మార్కులు సాధించారని తెలిపారు. నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అందించాలన్న లక్ష్యంతో శ్రీ చైతన్య విద్యాసంస్థలు నడుస్తున్నాయని అన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నామని పేర్కొన్నారు. ఏటా ఎంసెట్, నీట్, ఐఐటీ, జేఈఈ తదితర పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్‌లో అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత రమేశ్ రెడ్డి, డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్మోహన్ రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

'ఎస్‌వీజేసీ' విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కరీంనగర్: ఇంటర్ ఫలితాల్లో ఎస్‌వీజేసీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో ఎంబడి శ్వేత 990, ఎంపీసీలో వంగల రిషిక 989, నాగుల లయ 988 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో జుల హర్షిత 465, గడ్డం సాయిభువ 465, గుజార్ మనిదీక్షిత 465, కుమ్మరి సంస్కృతి 465, జె.సంతోష్ 465, కొయ్యడ అభిజ్ఞ 464, బి.దీక్షిత్ 464, బి.రాహుల్ 464, జి.గణేశ్ 464 మార్కులు, బైపీసీ విభాగంలో టి.శ్రీఅక్షిత్ 432, గుండా అక్షయ 430, ఎంఈసీలో మద్దూరి అక్షయ 477 మార్కులు సాధించారు. కళాశాల కరస్పాండెంట్ ఊట్కూరి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల కఠోర శ్రమకు, అధ్యాపకుల కృషికి ఈ ఫలితాలు నిదర్శనమన్నారు. జేఈఈ, నీట్, ఎంసెట్‌లలోనూ ఉత్తమ శిక్షణనిస్తున్నామని చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయనతో పాటు ఎస్‌వీజేసీ బాలుర క్యాంపస్ ప్రిన్సిపాల్ మేడ వెంకటవరప్రసాద్, బాలికల క్యాంపస్ ప్రిన్సిపాల్ కాంతల రాంరెడ్డి, డైరెక్టర్లు సింహాచలం, హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

'ఎస్ఆర్'కు స్టేట్ ఫస్ట్ ర్యాంకు



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యం

కరీంనగర్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కె.పూజ 994 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఎ.తిరుమలేశ్ 990, ఎ.రాము 990, ఎస్.ప్రవీణ్‌కుమార్ 990, బైపీసీ విభాగంలో ఎస్.మణిమాల 990, జి.ఆర్యన్ 989, ఎస్.కీర్తి 988, ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎస్.వైష్ణవి 467, ఎస్.హాసిని, ఎ.పల్లవి, ఎ.సువర్ణ, ఎం.శ్రావణిలు 466, సీహెచ్.ప్రణవి, పి.శ్రీజ, జి.సుప్రీత్, ఆర్.శ్రీనాథ, కె.ఓమేశ్వర్, బానోత్ జ్యోతిరాం, వి.నరేంద్ర శివ, కె.అభిరామ్, సీహెచ్.హరిత, ఎస్.భవాని, ఎస్.ప్రియాంక, బి.రచన, బి.నాగలక్ష్మి, డి.శ్రీజ, జి.శ్రీజ, వి.నందిని, ఎస్.జాస్మిత, ఎస్.మహితలకు 465, బైపీసీ విభాగంలో ఇందిర ప్రియదర్శిని, జి.శ్రీజలకు 434, ఎ.హన్సిక, బి.శిరీష 433, పి.వైష్ణవి, ఎస్.విష్ణుప్రియ, పి.లక్ష్మీప్రసన్న 432, జె.వేణుకుమార్, వి.హారిక 430 మార్కులు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. ఆయనతోపాటు డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, కరీంనగర్ జోనల్ ఇన్‌చార్జి వాసుదేవరెడ్డి, ప్రిన్సిపాళ్లు నాగార్జున్‌రెడ్డి, తిరుపతి, అశోక్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మారుతి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

రైస్ మిల్లర్ల దోపిడీ నుంచి రైతులను కాపాడాలి

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల: రైతులు కష్టపడి పండించిన పంటను రైస్‌మిల్లర్ల దోపిడీ చేస్తున్నారని, వారిబారి నుంచి రైతులను కాపాడాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. మంగళవారం అదనపు కలెక్టర్ లతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అకాల వర్షాలతో ఇప్పటికే పంటలు రైతులు నష్టపోయారని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తప్ప, తాలు పేరిట కోతలు విధిస్తూ మిల్లర్లు మళ్లీ దోచుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా మంత్రి కొప్పుల ఈశ్వర్ కొనుగోలు కేంద్రాలకు వెళ్లి కనీసం పరిశీలించింది లేదని, రైతుల గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ధర్మపురి, పెగడపల్లి, గొల్లపల్లి, వెల్గటూర్, బుగ్గారం మండలాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం వచ్చి ధాన్యాన్ని శుద్ధి చేసినా నాణ్యతగా లేదంటూ క్వింటాలుకు 5 కిలోలకుపైగా అదనపు తూకం వేస్తున్నారని అన్నారు. నాణ్యతగా లేదంటూ పక్కకు పెడుతున్నారన్నారు. మంత్రి ఈశ్వర్ ఆత్మీయ సమ్మేళనాలు అంటూ సంబరాలు చేసుకున్నారని, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఐకేపీ నిర్వాహకులు రైస్‌మిల్లర్లకు సహకరిస్తూ అదనపు తూకం వేస్తూ రైతులను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. రైస్‌మిల్లర్లు ధాన్యం అన్‌లోడ్ చేసేముందు ధర్మకాంటాపై తూకం వేసిన రశీదు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు శైలేందర్‌రెడ్డి, నిషాంత్‌రెడ్డి, రాములుగౌడ్, గంగాధర్, పురుషోత్తం, రాకేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్‌లోడ్ కోసం తిప్పలు పెడుతున్నారు..

- రైతులను గోస పెడుతున్న రైస్‌మిల్లర్లు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల(చల్‌గల్) మార్కెట్ యార్డుకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని నిర్వాహకులు కొనుగోలు చేసి జిల్లా కేంద్రంలోని ఓ రైస్‌మిల్లుకు పంపించారు. అయితే, రైస్‌మిల్లుకు పంపించిన లారీలో చల్‌గల్‌కు చెందిన గంగారెడ్డికి చెందిన 150 బస్తాలు, శ్రీనుకు చెందిన 70 బస్తాలు.. ఇలా 10 మంది రైతులకు చెందిన 650 బస్తాలు ఉన్నాయి. కొనుగోలు కేంద్రం నుంచి పంపించిన లారీని అన్‌లోడ్ చేయకుండా నాలుగైదు రోజులుగా మిల్లర్లు సతాయిస్తున్నారు. దీంతో, లారీ డ్రైవర్లు తిరిగి ధాన్యం మొత్తాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తామని మొత్తుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బాధిత రైతులు అడిషనల్ కలెక్టర్‌తోపాటు సహకార సంఘం అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ మిల్లర్లు లారీలోని ధాన్యం అన్‌లోడ్ చేయడంలేదు. ఈ నేపథ్యంలో అధికారులు కొడిమ్యాల మండలంలోని ఓ రైస్‌మిల్లుకు పంపించారు. అక్కడ సైతం లారీలోని ధాన్యాన్ని దించుకోవడం లేదు. లారీ డ్రైవర్ తన కిరాయి తనకు ఇస్తే, మీ ధాన్యాన్ని మీ కేంద్రంలో దించుతామని చెపుతున్నాడు. ఏంచేయాలో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సత్వరమే స్పందించి లారీని అన్‌లోడ్ చేయించాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇందుకు అధికారులు, సంబంధిత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే బాధ్యులవుతారని అన్నదాతలు అన్నారు.

సినీఫక్కీలో మోసం

- వృద్ధురాలి నుంచి రూ.11వేలు కాజేసిన ఆగంతకుడు



బాధితురాలు మల్లమ్మ



నిందితుడు సీసీ ఫుటేజీ ఫొటో

జగిత్యాలక్రైం: స్థానిక గొల్లపల్లి రోడ్డులో నివాసం ఉండే మల్లమ్మ స్థానిక అశోక్‌నగర్ ఎస్‌బీఐ నుంచి డబ్బులు డ్రా చేసుకునేందుకు మంగళవారం వచ్చింది. తన అకౌంట్ బ్యాలెన్స్ వివరాలు తెలపాలని కోరగా బ్యాంక్ సిబ్బంది రూ.12 వేలు ఉన్నట్లు తెలిపారు. తనకు ఎల్ఐసీ ద్వారా మరో రూ.50 వేలు వచ్చేవి ఉన్నాయని, బ్యాంక్ వారిని అడిగింది. ఆ సొమ్ము జమకాలేదని వారు చెప్పారు. అక్కడే ఉన్న ఓ అగంతకుడు ఈవివరాలన్నీ విన్నాడు. మల్లమ్మ తన ఖాతాలోని రూ.11 వేలు డ్రా చేసుకుని బయటకు రాగానే.. మున్సిపాలిటీ ఆఫీసుకు వస్తే ఎల్ఐసీ డబ్బులు కూడా ఇస్తానని అతడు వృద్ధురాలిని నమ్మించాడు. నమ్మిన ఆమె.. సమీపంలోని మున్సిపల్ కార్యాలయానికి వెళ్లింది. తనకు తొలుత రూ.11 వేలు ఇస్తే రూ.61 వేలు ఇప్పిస్తానని అగంతకుడు బదులిచ్చాడు. ఆ తర్వాత వృద్ధురాలి నుంచి రూ.11 వేలు తీసుకుని ఎటో వెళ్లిపోయాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో వృద్ధురాలు మోసపోయానని తెలుసుకుని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ చేస్తున్నారు.